సాక్షి నిర్మల్

బుధవారం ౹ 23 ౹ ఆగస్టు ౹ 2023



ఆయిల్‌పాంపై అవగాహన

లోకేశ్వరం(ముధోల్): రైతులు ఆయిల్‌పాం సాగుచేసి ఆర్థికంగా ఎదగాలని డీజీఎం రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం రైతు వేదికలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.



పాఠశాలలు తనిఖీ చేసిన జడ్జి

ఖానాపూర్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్సియల్, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలను ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/24.0

వాతావరణం

జిల్లాలో ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

బీజేపీ పార్లమెంటు కన్వీనర్, జాయింట్ కన్వీనర్ల నియామకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీజేపీ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు పార్టీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు స్థానాల్లో నాలుగు జిల్లాల పరిధిలో నలుగురిని నియమించారు. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి కన్వీనర్‌గా అయ్యన్నగారి భూమయ్య(నిర్మల్), జాయింట్ కన్వీనర్లుగా కొలిపాక కిరణ్‌కుమార్(ఆసిఫాబాద్), మయూర్ చంద్రజగతి(ఆదిలాబాద్), పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్‌గా పి.మల్లిఖార్జున్(పెద్దపల్లి), జాయింట్ కన్వీనర్‌గా నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్(మంచిర్యాల)ను నియమించారు. కన్వీనర్లు, కో కన్వీనర్లు లోకసభ నియోజకవర్గ పరిధిలో ఉన్న జిల్లాల్లో వచ్చే ఎన్నికల్లో పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేయనున్నారు.

నేడు 'కడెం'ను సందర్శించనున్న నిపుణుల బృందం

కడెం: రెండేళ్లుగా భారీ వరదలతో దెబ్బతిన్న కడెం ప్రాజెక్టును ఇటీవలే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) బృందం పరిశీలించి ఈఏసీకి నివేదిక అందజేసింది. కడెం ప్రాజెక్టుకు భారీ వరదలు రావడంతో ఔట్‌ఫ్లో సామర్థ్యం పెంచేందుకు అదనపు గేట్ల ఏర్పాటు, ప్రాజెక్ట్ మరమ్మతులు, తదితర అంశాలపై తుది నివేదికను అందించేందుకు నిపుణుల బృందం రానున్నట్లు ఇరిగేషన్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

27న రైతు సదస్సు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పంటలకు కనీస మద్దతు ధర చట్టం, దేశవ్యాప్త రుణమాఫీ, తదితర డిమాండ్ల సాధనకు సంయుక్త్ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 27 న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నంది రామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నూతన్ కుమార్, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, దేవిదాస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, ఏఐటీయూసీ నాయకుడు రమేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం




మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, భ్రూణహత్యలు నివారించి ఆడపిల్లలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఎంహెచ్‌వో ధనరాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీసీఅండ్‌పీఎన్‌డీటీ ఆక్ట్–1994 అడ్వైజరి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్ట బోయేది ఆడ, మగ అని తెలుసుకోవడానికి లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, జిల్లా సలహా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపకరణాలు పంపిణీ

నిర్మల్‌రూరల్: సమగ్ర శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలింకో సంస్థ సహకారంతో 0 నుంచి 18 సంవత్సరాలు కలిగిన బడీడు పిల్లలు పక్షవాతం, శారీరక వికలాంగత్వం, పోలియో, ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులు కోల్పోయినవారు, వినికిడి, దృష్టి లోపం ఉన్నవారికి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు మంత్రి ఐకేరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైనవారు వికలాంగత్వం కనిపించేలా రెండు ఫొటోలు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, ఆహార భద్రత కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాలని సూచించారు.

'ఇంజినీరింగ్' ఇక కలేనా..!



- జిల్లాకు దక్కని 'జేఎన్‌టీయూ'
- ఆదిలాబాద్‌లో ఏర్పాటుకు అనుమతి
- నిట్టూరుస్తున్న జిల్లావాసులు
- నిర్మల్‌లో ఏర్పాటుకు ప్రయత్నిస్తా : మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్: జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ.. ఇక కలగానే మిగలనుందా..! అంటే అవుననే చెప్పవచ్చు. నిండు సభలో నిర్మల్‌కు ఇంజినీరింగ్ కాలేజీ కావాలని సీఎం కేసీఆర్‌ను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అడిగినా.. కళాశాల మంజూరుకోసం తనవంతు ప్రయత్నం చేసినా.. ప్రభుత్వం పక్కనున్న ఆదిలాబాద్‌కు ఇచ్చింది. ఈలెక్కన ఇక జిల్లాలో జేఎన్‌టీయూ బ్రాంచ్ ఏర్పాటు కలగానే మిగలనుందని స్థానికులు నిట్టూరుస్తున్నారు. ఎక్కడెక్కడికో వెళ్లి చదువుతున్న తమ పిల్లలకు నిర్మల్‌లో కాలేజీ ఏర్పాటైతే దూరభారం తగ్గుతుందని భావించిన తల్లిదండ్రులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

ఆశలు ఆవిరి..

బహిరంగసభలో తమ జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ కావాలని అడిగింది మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. కాబట్టి సీఎం మంజూరు చేసిన జేఎన్‌టీయూ నిర్మల్‌లోనే ఏర్పాటవుతుందని అందరూ ఆశించారు. కానీ ఊహించని విధంగా ఆదిలాబాద్‌లో ఏర్పాటుకు అనుమతి ఇస్తున్నట్లు మంగళవారం ప్రభుత్వ కార్యదర్శి వాకాటి కరుణ పేరిట ఉత్తర్వులు వచ్చాయి. దీంతో జిల్లావాసులు ఒక్కసారిగా నిట్టూర్చారు. జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేసినట్లే.. రాబోయే రోజుల్లో జిల్లాకూ జేఎన్‌టీయూ బ్రాంచ్‌ను మంజూరు చేయాలని కోరుతున్నారు.

'సాక్షి' రాత.. మంత్రి వినతి..



నిర్మల్‌లో ఇంజినీరింగ్ కాలేజీ ఆవశ్యకతపై 'సాక్షి' కథనం

ఆదిలాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాలు, భైంసా ప్రాంతానికి మధ్యలో ఉన్న నిర్మల్‌జిల్లాలో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్) ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇదే విషయంపై జూన్ 4న సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ వస్తున్న సందర్భంలో..'ఇంజినీరింగ్.. ఇవ్వండి సారూ..' అన్న శీర్షికన 'సాక్షి' జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. జిల్లాలోనే ఎందుకు ఏర్పాటు చేయాలన్న నేపథ్యాన్నీ వివరించింది. ఇదేక్రమంలో అదేరోజు సాయంత్రం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బహిరంగసభలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైతం నిర్మల్‌లో ఇంజినీరింగ్ కాలేజీని ఏర్పాటు చేయాలని సీఎంను కోరారు. మంత్రి కోరికను మన్నిస్తూనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు జేఎన్‌టీయూ కాలేజీని మంజూరు చేస్తున్నామని, అది ఎక్కడా అనేది మళ్లీ నిర్ణయిస్తామని చెప్పారు.

ఏర్పాటుకు కృషి చేస్తా



నిర్మల్‌లో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని జూన్ 4న జిల్లాకు వచ్చిన సీఎం కేసీఆర్‌ను బహిరంగసభలోనే కోరాం. ప్రభుత్వం ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ప్రారంభానికి అనుమతినిచ్చింది. నిర్మల్‌లో కూడా జేఎన్‌టీయూ కాలేజీ ఏర్పాటు విషయమై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా. ఇక్కడ కూడా కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తా. – ఐకే రెడ్డి, రాష్ట్ర మంత్రి

అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానున్నవేళ..!

- నేడే చంద్రయాన్–3 ల్యాండింగ్
- ప్రత్యక్ష ప్రసారం చేయనున్న ఇస్రో



చంద్రునిపై నేడు దిగనున్న విక్రమ్ ల్యాండర్

నిర్మల్ ఖిల్లా: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంతరిక్షంలోని జాబిల్లి పైకి పంపిన చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ నేడు చంద్రుని పైకి అడుగిడనుంది. ఈ సన్నివేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు జిల్లావాసులు సిద్ధమవుతున్నారు. తీవ్ర ఉత్కంఠమధ్య ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్న తరుణంలో కోట్లదిమంది వీక్షకులు చంద్రుడిపై సురక్షితంగా ల్యాండింగ్ కావాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని విద్యార్థులు, యువత, సైన్స్ ప్రేమికులు, వీక్షకులు నేటి సాయంత్రం 5:30 గంటల నుంచి ఇస్రో ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్న ఈ దృశ్యాలను వీక్షించేందుకు సన్నద్ధమవుతున్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో గత జూలై 14న చంద్రయాన్–3 రాకెట్ ను విజయవంతంగా ప్రయోగించారు. ఈ దృశ్యాలను జిల్లావాసులు డిజిటల్ తెరలపై వీక్షించారు. భారత్ కలల ప్రాజెక్టు చంద్రయాన్–3 ల్యాండింగ్ సైతం విజయవంతంగా పూర్తయితే ప్రపంచ దేశాల్లో భారత్ పేరు మార్మోగుతుంది.

చంద్రయాన్–3 వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

చంద్రయాన్–3 నేటి సాయంత్రం జాబిల్లిపై ల్యాండింగ్ అవుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం 5:30 నుండి 6:30 గంటల వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈ ప్రసారాలను తిలకించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఏ.రవీందర్ రెడ్డి సూచించారు. ఈ మేరకు జిల్లాలోని ఆయా పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.5,500 కోట్ల స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. 16 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వం చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారని, నాలుగేళ్లుగా చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచలేదన్నారు. తక్షణమే తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దిగంబర్, మున్నా, నవీన్, రాజేశ్, వెంకటేశ్, సాయి, రమేశ్, శేఖర్ పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

కుంటాల(ముధోల్): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం తలపెట్టిన పల్లె ప్రగతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం అందాకూర్, కుంటాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు–మనబడి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ కోసం జోడో బ్యాగుల తయారీకి కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి రాజబాపును అభినందించారు. కుంటాలలోని ప్రాథమిక, ఉన్నతపాఠశాల, ఆదర్శ పాఠశాల, భవిత కేంద్రం, బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు, విద్యార్థులకు పాఠాలు బోధించి సందేహాలు నివృత్తి చేశారు. అందాకూర్ శివారులో రైతు యోగిరాజ్ పటేల్ బెడ్ పద్ధతిపై 25 ఎకరాల్లో సాగు చేస్తున్న సోయా పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతును అభినందించారు. కార్యక్రమంలో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఏడీఏ వీణ, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏవో సోమ లింగారెడ్డి, ఎంపీవో రహీం, సర్పంచులు దాసరి కిషన్, దొనికెన సమత, ఏఈవోలు గణేశ్, మహేష్, శ్రీధర్, ప్రగతి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిచేయించుకోవాలి

లోకేశ్వరం(ముధోల్): అర్హులైన ఓటర్లు జాబితాలో తప్పులుంటే బీఎల్‌వోలతో సరిచేయించుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం హావర్గ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకుని జాబితాలో పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మోతీరాం, ఆర్‌ఐ బాలకిషన్, బీఎల్‌వోలు ఉన్నారు.

- రైతులకు వ్యతిరేకంగా మాస్టర్‌ప్లాన్ ఉండదు
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- దీక్ష విరమించిన రైతులు

ఎవరికీ అన్యాయం జరగనివ్వం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి

నిర్మల్: రైతులకు వ్యతిరేకంగా మాస్టర్‌ప్లాన్ ఉండదని, ఒక్క ఇంచు భూమికూడా కోల్పోనివ్వమని, దీనిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలంటూ మంగళవారం రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్న రైతుల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నది మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ మాత్రమేనని, ఇది ఫైనల్ కాదన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. ప్రజల అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకునే మాస్టర్‌ప్లాన్ ఫైనల్ అవుతుందన్నారు.

అవగాహన లేకుండా..

మాస్టర్‌ప్లాన్‌పై ప్రతిపక్షాల నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, వారి మాటలు నమ్మి రైతులు, ప్రజలు మోసపోవద్దని మంత్రి పేర్కొన్నారు. మంజులాపూర్–తల్వేదలో విలువైన భూముల్లో ఇండస్ట్రియల్‌జోన్, నాయుడివాడ–బంగల్‌పేట్‌లో రోడ్డు ప్రతిపాదనలు ఉండవన్నారు. ఇంకా అనుమానాలు ఉంటే.. త్వరలో జిల్లా పర్యటనకు రానున్న మంత్రి కేటీఆర్‌తోనూ మాట ఇప్పిస్తామని చెప్పారు. మంత్రి హామీ మేరకు దీక్షను విరమిస్తున్నట్లు రైతులు ప్రకటించారు. మంత్రి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ గణేశ్ చక్రవర్తి రైతులకు కొబ్బరినీళ్లు ఇచ్చి దీక్షను విరమింపజేయించారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు దొంతుల రవి, తోట రవి, ఒడ్నాల వెంకటరమణ, కొబ్బాయి శ్రీనివాస్, అనుముల సంతోష్, ఆదుముల్ల సంతోష్, బోడ శ్రీనివాస్, మంజులాపూర్, బంగల్‌పేట్, తల్వేద, గాజుల్‌పేట్, నాయిడివాడ తదితర ప్రాంతాల రైతులు, బీఆర్‌ఎస్ నేత రాంకిషన్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం నిలువకు ఇబ్బందులు ఉండవు

లక్ష్మణచాంద: జిల్లాలో ఇక నుంచి ధాన్యం నిల్వలకు ఇబ్బందులు ఉండవని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. మంగళవారం బోరిగాంలో నిర్మిస్తున్న గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.25 కోట్లతో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను నిర్మిస్తున్నామన్నారు. త్వరలో సారంగాపూర్ మండలంలోని ఆలూర్‌లో 50 ఎకరాల విస్తీర్ణంలో మరో 50 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును నిర్మించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, డీఎస్‌వో శ్రీకళ, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమంలో ఆదర్శం తెలంగాణ

మామడ: రైతులకు సంక్షేమ పథకాలు అందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఆదర్శంగా నిలిచిందని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. మంగళవారం కొరిటికల్‌లో నూతన గ్రామ పంచాయితీ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ ముందు చూపుతో రైతుల సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు. అంతకుముందు బోరిగాం క్రాస్ రోడ్డు నుంచి కొరిటికల్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, సర్పంచ్ బోజవ్వ బాపురెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు గంగారెడ్డి, ఎంపీటీసీ అందె సౌజన్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకోసం 'తొలిమెట్టు'



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి నర్సయ్య

నిర్మల్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తొలిమెట్టు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా సెక్టోరియల్ అధికారి నర్స య్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సోమవార పేటలో గల బాలికల పాఠశాలలో మంగళవారం రిసోర్స్ పర్సన్లు, సీఆర్పీలకు తొలిమెట్టు కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆయా క్లస్టర్‌లోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు వివరించాలన్నారు. ఎంఈవో శంకర్, రూమ్ టు రీడ్ జిల్లా లీడ్ అధికారి గోనె రవి, రిసోర్స్ పర్సన్లు గోపాల్, సంగీత, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, రూం టురీడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జాన్సన్ నాయక్



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జాన్సన్

ఖానాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ మంగళవారం సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రగతి భవన్‌లో మర్యాద పూర్వకంగా సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు, రాజ్యసభభ సభ్యుడు, గ్రీన్‌ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు జోగినిపల్లి సంతోశ్‌లను వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట ఆలయంలో మంగళవారం సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వైభవంగా నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు, యజ్ఞం, నూతన వస్త్రాలంకరణ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ–మురళీధర్ రెడ్డి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రానికి శాపంగా మారిన బీజేపీ, బీఆర్‌ఎస్



పార్టీలో చేరిన వారితో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రాష్ట్రానికి శాపంగా మారాయని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీహరి క్యాంపు కార్యాలయంలో దిలావర్‌పూర్ మండలం కదిలి, మాడేగాం గ్రామాలతో పాటు లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలతో ప్రజల బతుకులు ఆగమైపోతున్నాయన్నారు. రెండు ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఒడ్నాల రాజేశ్వర్, రవీందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, అర్గుల రమణ, హఫీజ్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు ఇప్పించండి సారూ..!



కలెక్టర్‌కు విన్నవిస్తున్న మహిళలు

కుంటాల(ముధోల్): మేమంతా పేదోళ్లం.. దళిత బంధు పథకం ఇప్పించండి సారూ.. అంటూ మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళలు మంగళవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కలిసి వినపత్రం అందజేశారు. ఇక్కడ సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా పరిగణలోకి తీసుకోకుండా రాజకీయ కోణంలో లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేయాలని వారు కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

'మాస్టర్ ప్లాన్ రద్దు చేయాల్సిందే'



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో తీసుకువచ్చిన మాస్టర్ ప్లాన్ పూర్తిగా రద్దు చేయాల్సిందేనని బీజేపీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల రాంనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం దొంగచాటుగా జీవో 220 తీసుకొచ్చి దాదాపు 2వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు మంత్రి అనుచరులతో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారన్నారు. మహేశ్వర్‌రెడ్డి ఆమరణ నిరాహార దీక్షతో ప్రజల్లో ఆదరణ వస్తుందని గ్రహించి అర్ధరాత్రి పోలీసు బలగాలతో దీక్షను భగ్నం చేయించారన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీసీ ఫెడరేషన్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి'

నిర్మల్‌చైన్‌గేట్: బీసీ ఫెడరేషన్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని బీసీ కులాల ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుర్గారావు, కీర్తి యుగేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నాయీ బ్రాహ్మణ సంఘ భవనంలో మంగళవారం తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులాల్లో సొసైటీ రుణాల మంజూరుకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. జీవన్, శ్రీకాంత్, సురేందర్, సాయిబాబా, వాహిద్, సందీప్ పాల్గొన్నారు.

డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డులు

- పాత కార్డుల స్థానంలో ఇవ్వాలని నిర్ణయం
- ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ
- ఆరోగ్యమిత్రల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు
- జిల్లాలో కార్డులు 6 లక్షలకు పైగానే..
- కొత్త కార్డులతో సేవలు సులువు


నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డు ఎంట్రీ చేస్తున్న ఆరోగ్యమిత్ర



డిజిటల్ కార్డు సక్సెస్‌ఫుల్‌గా నమోదైనట్టు చూపిస్తున్న మెసేజ్

నిర్మల్‌చైన్‌గేట్: ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా డిజిటల్ హెల్త్ కార్డుల జారీ ప్రక్రియ మొదలైంది. ఇప్పటి వరకు ఉన్న కార్డుల స్థానంలో కొత్తగా డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ నెల 15 నుంచి కార్యక్రమాన్ని ట్రస్ట్ ద్వారా ప్రారంభించారు. ఇందుకు ప్రభుత్వ ఆస్పత్రులు, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోని ఆరోగ్యమిత్రల ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయిస్తున్నారు. ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకం కింద పేదలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ యోజన పథకం ద్వారా రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ కింద రూ.2లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో తెల్లరేషన్ కార్డుదారులందరికీ ఆరోగ్య శ్రీ కార్డులు అందజేశారు. తెలంగాణ ఏర్పడ్డాక ఆహార భద్రత కార్డులు జారీ చేయగా వాటి లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. ఇప్పుడు పాత కార్డులన్నింటి స్థానంలో డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు.

ఆరోగ్య మిత్రల ద్వారా నమోదు...

డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియలో ఆరోగ్య మిత్రల సేవలను వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఆహార భద్రత కార్డుకు ఆధార్ లింక్ చేయబడిన సెల్‌నంబర్, ఇతర వివరాలను ఆరోగ్యమిత్రకు అందజేస్తే వారు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఆ తర్వాత వారం, పది రోజుల్లో డిజిటల్ కార్డు జారీ అవుతుంది. తద్వారా ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు పొందడం సులువవుతుందని అధికారులు చెబుతున్నారు.

1,584 రకాల వైద్యసేవలు...

ఇటీవల ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు విస్తృతమయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో బిల్లులు పేరుకుపోవడంతో చికిత్సతో పాటు శస్త్రచికిత్స చేయడానికి సుముఖత చూపడం లేదు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం వైద్యసేవలు మెరుగయ్యాయి. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా 1,584 రకాల చికిత్సలు ఉచితంగా అందుతుండగా ఇందులో ఆయుష్మాన్ భారత్ ద్వారా 642, ఆరోగ్యశ్రీ ద్వారా 942 వైద్య సేవలు అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ పథకాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తుండటంతో ఎక్కువ మంది ఈ పథకాన్ని ఎంచుకుంటున్నారు. పాత కార్డులు కొన్నిచోట్ల పనిచేయక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న 6,43,311 లక్షల పాతకార్డుల స్థానంలో డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు.

డిజిటల్ కార్డుతో ఉపయోగం...

కొత్తగా జారీ చేస్తున్న డిజిటల్ హెల్త్ కార్డులతో ఆస్పత్రుల్లో చికిత్స కోసం వెళ్లినప్పుడు రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తవుతుంది. ప్రస్తుతం ఉన్న కార్డులో కుటుంబ సభ్యుల వివరాలన్నీ ఉంటున్నాయి. డిజిటల్ కార్డు మాత్రం అందరికీ వేర్వేరుగా జారీ చేస్తారు. తద్వారా వివరాల నమోదు సులువవుతుంది. ఈ కార్డుపై బార్ కోడ్, క్యూఆర్ కోడ్ ఉండడం స్కైప్ చేయగానే వివరాలు వెల్లడై త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి చికిత్స ప్రారంభిస్తారు.

డిజిటల్ కార్డులు తీసుకోవాలి...



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ డిజిటల్ హెల్త్ కార్డులు ప్రతి ఒక్కరూ తీసుకోవాలి. ఆహారభద్రత కార్డుతో ఆధార్ లింక్ చేయబడిన సెల్ నంబర్, ఇతర వివరాలు సమీప ఆస్పత్రిలోని ఆరోగ్యమిత్రకు ఇస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత డిజిటల్ హెల్త్ కార్డు జారీ అవుతుంది.
– సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మేనేజర్

క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న నయాగావ్ ఎమ్మెల్యే


పూజలు చేస్తున్న నయాగావ్ ఎమ్మెల్యే రాజేశ్‌పవార్

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని మహారాష్ట్రలోని నయాగావ్ ఎమ్మెల్యే రాజేశ్‌పవార్ మంగళవారం దర్శించుకున్నారు. ప్రవాస్ యోజనలో భాగంగా ముధోల్ నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే మంగళవారం బాసర చేరుకున్నారు. సరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నాగోబా ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా ఆలయంలో నిర్వహించిన నాగుల పంచమి పూజ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన హుండిని మంగళవారం మెస్రం వంశీయులు లెక్కించారు. రూ.2లక్షల11వేల517 ఆదాయం వచ్చినట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయాభివృద్ధికి ఖర్చు చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెస్రం వంశీయులు మెస్రం బాదిరావ్, మెస్రం వంశం ఉద్యోగస్తులు మెస్రం మనోహర్, మెస్రం దేవ్‌రావ్, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం వంశీయులు నాగ్‌నాథ్, శేఖ్‌నాథ్ ఉన్నారు.

బీఈడీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కేబీ ప్రాంగణంలోని ఐటీడీఏ బీఈడీ కళాశాలలో బీఈడీ కోర్సులో ప్రవేశానికి తెలంగాణ రాష్ట్రంలోని అర్హత కలిగిన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితంలో 25 సీట్లు, జీవ శాస్త్రంలో 20, సాంఘికశాస్త్రంలో 35, భౌతిక శాస్త్రంలో 10, ఆంగ్లంలో 10 సీట్ల చొప్పున మొత్తం 100 సీట్లకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారాలను కళాశాల పనిదినాల్లో అభ్యర్థులు ఈ నెల 24 నుంచి సెప్టెంబర్ 23 వరకు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు సమర్పించుటకు వచ్చే నెల 23 సాయంత్రం 5గంటల లోపు కళాశాలలో సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకూ అడ్మిషన్ ఇన్‌చార్జి 9440848073, 8500995561 సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలోని అర్హులైన గిరిజన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జాన్సన్‌నాయక్


ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: బీఆర్ఎస్ ఖానాపూర్ అభ్యర్థిగా ఎంపిక అనంతరం బుక్యా జాన్సన్‌నాయక్ ఇప్పటికే జిల్లా మంత్రి ఐకేరెడ్డితో పాటు జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు, అభ్యర్థులను రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించిన సీఎం కేసీఆర్‌తో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జాన్సన్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రిని కలిసిన అనిల్ జాదవ్


మంత్రిని సన్మానిస్తున్న అనిల్‌జాదవ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

ముఖరా(కె) గ్రామం అభివృద్ధి భేష్

- అడిషనల్ కలెక్టర్ ఖుష్బు గుప్తా


సేంద్రియ ఎరువుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గుప్తా

ఇచ్చోడ: ముఖరా(కె) గ్రామం అభివృద్ధిలో దేశంలోనే అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని అడిషనల్ కలెక్టర్ ఖుష్బు గుప్తా అన్నారు. మంగళవారం ముఖరా(కె) గ్రామాన్ని సందర్శించి మాట్లాడారు. గ్రామంలో ఎక్కడ చూసినా స్వచ్ఛత, ఆకుపచ్చని మొక్కలు దర్శనమిస్తాయని అన్నారు. ప్రతీ గ్రామం ఈ విధంగా తయారైతే గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి తిరుగుతూ మరగుదొడ్లు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. పార్క్, సేంద్రియ ఎరువుల కేంద్రం, సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ గాడ్గే మీనాక్షిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గే సుభాష్, డీఎల్‌పీవో ధర్మరాణి, భిక్షపతి, ఎంపీడీవో రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి తలసాని క్షమాపణ చెప్పాలి

- మంత్రి తలసాని దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

తానూరు: హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లిన భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిజన నేత రాజేశ్‌బాబును నెట్టివేసి చెంపదెబ్బ కొట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం తానూరులో గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తలసాని దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గిరిజన సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ పార్టీలోకి ఎవరొచ్చినా ఆహ్వానిస్తాం'


సమావేశంలో మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

ఖానాపూర్: రాష్ట్రంలో కేసీఆర్ నియంతపాలన పోవాలంటే కాంగ్రెస్ పార్టీలోకి ఎవరొచ్చినా ఆహ్వానిస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో ఆయా మండలాలకు చెందిన పార్టీ ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యబద్ధంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. పార్టీలో టికెట్ ఆశించే ప్రతీ ఒక్కరూ అధిష్టానం వద్ద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అజ్మీరా శ్యాంనాయక్ కాంగ్రెస్‌లో చేరడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే అవకాశం ఉందని, కొత్త వారు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఎప్పటికప్పుడు అధిష్టానం సర్వేల ఆధారంగానే సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని టికెట్లను కేటాయిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు దయానంద్, స్వప్నిల్‌రెడ్డి, కలీం, ఉత్తం, యూసుఫ్‌ఖాన్, నిమ్మల రమేశ్, గంగ నర్సయ్య, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, ఎంఏ మజీద్, జహీర్ అహ్మద్, మల్లేష్, స్వప్నిల్‌రెడ్డి, ఆసిఫ్, శ్యాం, సలీంఖాన్, జంగిలి శంకర్ ఉన్నారు.

కొనసాగుతున్న అభ్యర్థన దీక్ష


ట్రిపుల్‌ఐటీ గేటు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో మంగళవారం అభ్యర్థన దీక్ష కొనసాగింది. ఆరవ రోజు ట్రిపుల్ ఐటీ ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల సంఘం ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ట్రిపుల్‌ఐటీలో పనిచేసే కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యూలర్ చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే అనేక మంది ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేశారన్నారు. యూజీసీ నియమ నిబంధనలకు అనుగుణంగా తాము ఉద్యోగంలో చేరామని రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులకు బోధిస్తున్నామని తెలిపారు. ప్రతిష్టాత్మక ట్రిపుల్‌ఐటీలో పనిచేసే తమకు రెగ్యూలర్ చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా సేవలు అందిస్తున్న తమను రెగ్యూలర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అజయ్, ఉపేందర్‌రావు, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, రాకేశ్‌రెడ్డి, కోశాధికారి దత్తు, పీఆర్‌ఓ డాక్టర్ గోపాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ తేజస్వీ, అంజనేయులు పాల్గొన్నారు.

అంద్ ఆదివాసీ గ్రామాల్లో శిరాళ్ ఉత్సవాలు


సంప్రదాయ నృత్యాలు చేస్తున్న ఆదివాసీ మహిళలు

ఇంద్రవెల్లి: మండలంలో అంద్ ఆదివాసీ గ్రామాల్లో నాగుల పంచమి మరుసటి రోజు నిర్వహించే శిరాళ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలోని పుట్ట మట్టిని గ్రామ పెద్ద ఇంటికి తీసుకొచ్చి శిరాళ్ దేవతలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సంతానం లేనివారు పిల్లలు కలుగాలని, ప్రజలు, పాడి, పశువుల ఆరోగ్యంగా ఉండాలని శిరాళ్ దేవతను వేడుకున్నారు. అనంతరం మహిళలు శిరాళ్ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగిస్తూ చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ గారుళే కుసుంబాయి, గ్రామ పెద్దలు దశరథ్, ముఖడే ఉత్తం, ముఖడే విష్ణు ఉన్నారు.

తమ్ముడిపై కత్తితో దాడి

ఆదిలాబాద్‌టౌన్: ఒక తల్లి కడుపున పుట్టకపోయిన ఒకే తండ్రి రక్తం పంచుకుని పుట్టామని కూడా చూడకుండా తమ్ముడిపై అన్న దాడికి దిగిన సంఘటన పట్టణంలోని టుటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. టుటౌన్ పోలీసు అధికారి జీవీ రమణారెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో నివాసం ఉంటున్న కుమ్ర జంగుకు ఇద్దరు భార్యలు, వారిద్దరూ చనిపోయారు. ఇదిలా ఉంటే మొదటి భార్య కుమారుడు నంద కిషోర్, రెండవ భార్య కుమారుడు గజానంద్. గజానంద్ భార్య పుట్టింటికి వెళ్లగా నంద కిషోర్ భార్యే అందరికీ వంట చేసి పెడుతోంది. నందకిషోర్ పనిచేసి కూలీ డబ్బుల ఇంట్లో ఇస్తుంటే గజానంద్ మాత్రం డబ్బులు ఇంట్లో ఇచ్చేవాడు కాదు. ఈ విషయంలో నందకిషోర్ గజానంద్‌తో తరుచుగా గొడవ పడుతుండటమే కాకుండా ఇంట్లో నుంచి వెళ్లగొట్టాలని చూసేవాడు. ఈ క్రమంలో సోమవారం గజానంద్ పనికి వెళ్లి రాత్రి 10 గంటలకు ఇంటికి వస్తుండగా నందకిషోర్ ఖుర్షీద్‌నగర్‌లో అడ్డుకుని కత్తితో దాడికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు గజానంద్‌ను ఆస్పత్రిలో చేర్పించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు తండ్రి కుమ్ర జంగు ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

చైన్ దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: బంగారు చైన్ దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు. సీఐ కథనం ప్రకారం .. సిద్దిలకుంట గ్రామానికి చెందిన కొండ సురేఖ ఆరోగ్యం బాగలేక స్థానిక సంజీవని ఆస్పత్రిలో ఈ నెల 20న చేరికైంది. ఆమె నిద్రపోతున్న సమయంలో మెడలో నుంచి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు రెండు తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించారు. ఈ విషయమై నిర్మల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దీంతో మంగళవారం స్థానిక గాంధీచౌక్ ప్రాంతంలో సంజీవని ఆస్పత్రికి చెందిన కంపౌండర్ మటకం గోవర్ధన్ బంగారు షాపుల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. పుస్తెల తాడు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో కాలినడకన వెళ్తున్న మహిళను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 18న ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన నీలాబాయి బ్యాంక్ పనులు ముగించుకొని రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్‌తో ఓ వ్యక్తి ఢీకొట్టాడు. గాయాల పాలు కాగా ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. బాధితురాలి కుమారుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైన్స్ డిగ్రీ కళాశాలకు పీజీ ర్యాంకుల పంట


మొదటి ర్యాంకు సాధించిన రుమాతాయి

ఆదిలాబాద్‌టౌన్: పీజీ ప్రవేశపరీక్ష ఫలితాల్లో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెరుగైన ర్యాంకులు సాధించారు. మంగళవారం విడుదలైన ఈ ఫలితాల్లో ముండే రుమా తాయి ఎంఏ హిస్టరీలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, పొలిటికల్ సైన్స్‌లో 59వ, ఇంగ్లిష్‌లో 179వ ర్యాంకులతో సత్తా చాటారు. అలాగే ఖడ్సే విష్ణుప్రియ హిందీలో 10వ ర్యాంకు, గణితంలో 29, కందుకూరి సాహితి భౌతికశాస్త్రంలో 62, కంప్యూటర్ సైన్స్‌లో 205, సిరిపురే శ్రద్ధ రసాయన శాస్త్రంలో 262, గాజుల ప్రత్యూష గణితంలో 308, పిట్ల అపర్ణ గణితంలో 788, ఇరవైన ప్రియాంక గణితంలో 1298వ ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి


శివరాజ్‌కుమార్(ఫైల్)

కుంటాల: మండల కేంద్రానికి చెందిన దాసరి శివరాజ్(57) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. శివరాజ్ కుమార్ భైంసా డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి తన కుమారుడు కృష్ణ పైచదువుల కోసం అమెరికా వెళ్తుండగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబ సభ్యులంతా వీడ్కోలు పలికి హైదరాబాద్‌లోని ఇంటికి వచ్చారు. అంతలోనే గుండెపోటు రావడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కుమారుడికి సమాచారం అందించడంతో తిరుగు పయనమయ్యాడు. మంగళవారం జరిగిన అంత్రక్రియలో డిపో మేనేజర్ అమృత పాల్గొని నివాళులర్పించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

తలమడుగు: ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం... లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆత్రం సత్యనారాయణ(29) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం ఆత్రం కమలతో పెళ్లి కాగా మూడు నెలల పాప ఉంది. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మద్యం మత్తులో గ్రామ శివారులోని తన తండ్రి పంటచేనులో సోమవారం పురుగుల మందుతాగి పడిపోయాడు. గమనించిన తండ్రి ముత్తన్న చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్సై సురేందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

మోపాల్: నిజామాబాద్ జిల్లా మోపాల్‌లోని ఓ కోళ్ల ఫారంలో కూలి పనిచేస్తున్న మురీష్(41) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మోపాల్ ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా కుంటాల మండలం లింబా(కె) గ్రామానికి చెందిన మురీష్ వారం క్రితం తాను సహజీవనం చేస్తున్న లక్ష్మితో కలిసి మోపాల్‌లోని కోళ్ల ఫారంలో పనిలో చేరాడు. మురీష్ తాగుడుకు బానిసై సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో లక్ష్మి కుటుంబ సభ్యులతో చెప్పడంతో వారు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన మురీష్ మంగళవారం కోళ్లఫారంలోనే ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడు తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానవత్వం చాటిన జీపీ సిబ్బంది


పోలీసుల సమక్షంలో స్వగ్రామానికి పంపిస్తున్న పోలీసులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని శ్మశాన వాటిక వద్ద మతిస్థిమితం లేని ఓ నిండు గర్భిణి మూడు రోజులుగా తిరుగుతూ కనిపించింది. మంగళవారం గమనించిన ఉట్నూర్ గ్రామపంచాయతీ ఈవో శంకర్, సిబ్బంది వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ గిరిజన మహిళను స్థానిక గ్రామ పంచాయతీకి తరలించి శుభ్రం చేసి భోజనం పెట్టారు. ఉట్నూర్ పోలీసుల సహకారంతో షీటీం ద్వార కెరిమెరి మండలం హట్టి గ్రామానికి చెందినదిగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించింది.

కరెంట్‌షాక్‌తో హెల్పర్‌కు గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లింగోజితండాకు చెందిన జాదవ్ ప్రకాశ్ విద్యుత్ హెల్పర్‌గా అదే గ్రామంలో పనిచేస్తున్నాడు. మంగళవారం అదే గ్రామంలోని స్తంభంపైకి విద్యుత్ మరమ్మతులు చేసేందుకు ఎక్కడంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. దీంతో మెడకు, కాలికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు 108లో ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రకాశ్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈని వివరణ కోరగా మండలంలోని పెర్కగుడా గ్రామంలో విద్యుత్ సమస్య ఉండగా ఎల్‌సీ తీసుకుని పనులు పూర్తి చేశాడని, అనంతరం ఎల్‌సీ తీసుకోకుండా లింగోజి తండా ఎక్స్‌రోడ్డు వద్ద గల స్తంభం పైకి ఎక్కడంతో షాక్‌కు గురైనట్లు చెప్పాడు.